కథ - మాదిరాజు నిర్మల

# ఆడపడుచు

ఈరోజు నాకు ఎంతో ఆనందంగా ఉంది. వదిన కాపురానికి వస్తున్నది ఈరోజే. మా కుటుంబ సభ్యులలో ఒక కొత్త మెంబర్ చేరుతోంది. ఆ మాటే అన్నయ్యతో అంటే ''మన ఇంటి సభ్యుల సంఖ్య ఏమీ పెరగటం లేదు, ఇదివరకు ఎంతమంది ఉన్నామో ఇప్పుడూ అంతేనే'' అన్నాడు. 'వాడి లెక్క ఏమిటా' అని ఆలోచిస్తూ నవ్వు ఆపుకొంటున్న అన్నయ్య వంక అనుమానంగా చూసాను.

''నువ్వు లెక్కల్లో మొద్దువుకదూ నేనే చెప్తున్నా, నిన్నూ కొద్దిరోజుల్లో పెళ్ళి చేసి ఇంకో ఇంటికి తరిమేస్తాంగా'' అన్నాడు. నాకు వాడి మాటలకు నవ్వు వచ్చింది.

''నేను లెక్కల్లో మొద్దునయితే, నువ్వు నెంబర్వన్ మొద్దువి. ఎందుకంటే నన్ను తీసివేసినా సంవత్సరానికి ఒక్కళ్ళో లేక ఇద్దరు చొప్పున మీ ఆవిడ ఇల్లంతా పిల్లలతో నింపేస్తుందేమో'' అన్నాను.

ఇద్దరం నవ్వుకుంటున్నాం.

వాకిట్లో ఆటో ఆగిన చప్పుడు వినిపించింది.

''వంశీ మీ అత్తగారు వాళ్ళు వచ్చారురా'' అంటూ అమ్మ గబగబా బైటకు వెళ్ళింది. మేమిద్దరం కూడా బయటకు వచ్చాం.

నేను వదిన వంక చూస్తూ పలకరింపుగా నవ్వాను. స్నేహభావంతో తన చేతిని నా చేతిలోకి తీసుకున్నా. తనూ నవ్వింది.

★ ★ ★

ఎప్పుడూ చెదరని చిరునవ్వుతో ఎంతో అందంగా వుండే మా వదినను చూస్తున్నప్పుడల్లా 'అన్నయ్య ఎంత అదృష్టవంతుడు' అనుకునేదాన్ని. వాడి అదృష్టం సంగతేమోగానీ నేనెంత దురదృష్టవంతురాలినో రోజురోజుకు తెలిసొచ్చేట్లు చేసింది.

మా యింటికి ఒక 'తాత' వతనుగా వచ్చి గాజులు అమ్మేవాడు. గాజులు తెచ్చిన రోజున ఏవో కబుర్లు చెప్తూ మా వరండాలో ఒక గంట నిద్రపోయి, మేము ఏదన్నా పెట్టింది తిని వెళ్ళేవాడు. ఒకరోజు ఆ గాజుల తాత వచ్చాడు. వదినను చూసి ముచ్చటపడి ఏదో ఒకటి పలకరించాలన్నట్లుగా వాళ్ళ అమ్మా నాన్నల గురించి అడిగి ''ఎంత కట్నం ఇచ్చారమ్మా'' అని అడిగాడు. మా వదిన టక్కున ''20 వేలు పోసి కొనుక్కున్నాం వీళ్ళను'' అంది.

అంతవరకూ నవ్వుతూ ఉన్న తాత మొహం వాడిపోయింది. నాకూ తన మాటలకు ఆశ్చర్యం, కొంత బాధా కలిగినా పైకి కనపడనీయకుండా, ''20 వేలతో నువ్వు ఎవరెవరిని కొనుక్కున్నావో కాని నన్ను మాత్రం నువ్వు ఎప్పటికీ కొనలేవు'' అన్నాను.

అమ్మా వాళ్ళు లేనప్పుడు మా యింటికి ఎవరయినా వస్తే తన అందం గురించి తనే వర్ణించుకుంటూ, తెల్లగా ఉండే తన పక్కన చామనఛాయగా ఉండే మా అన్నయ్య తనకు తగినవాడు కాదన్నట్లు మాట్లాడేది. ఆ సమయంలో నాకు తనను చూస్తే ఎంతో కోపం వచ్చేది. ఎన్నోసార్లు మా అన్నయ్య 'గాజు ముక్క మీద సూర్యకిరణాలు పడి మెరుస్తుంటే దానిని చూసి వజ్రం అనుకున్నట్లు, మా వదిన అందాన్ని చూసి భ్రమపడ్డాడు. ఆ అందమైన శరీరం లోపల వున్న వికృతమైన మనస్సును చూడగలిగితే వాడి గుండె పగిలిపోయి ఉండేది గదా!' అని బాధపడేదాన్ని. అన్నయ్యతో ఎంతో ప్రేమగా మసిలే వదిన అన్నయ్య లేనప్పుడు ప్రవర్తించే తీరు గురించి ఒకసారి అమ్మానాన్నలతో అన్నాను. దానికి వాళ్ళు తన గురించి అలా మాట్లాడినందుకు ఆడపడుచు హోదా చూపించకు అనేశారు. ఆ తర్వాత నేనెప్పుడూ తన గురించి ఏమీ అనలేదు. అయినా నాకే వదిన క్యారక్టర్ అర్థం అయినప్పుడు, నాకంటే డబల్ వయస్సులో వున్న అమ్మా నాన్నలకు అర్థం కాదా అనుకున్నాను.

★ ★ ★

వదిన వచ్చినందుకు నాకు ఒక మంచి ఫ్రెండ్ దొరికిందనుకున్నంతసేపు పట్టలేదు, తన దృష్టిలో నేను ఎలాంటిదాన్నో అర్థం చేసుకునేందుకు. పనిమనిషికంటే హీనంగా చూస్తోందని నాకు అర్థం అయ్యేసరికి నా పరిస్థితి నా యింట్లో ఒక పనిమనిషిగానే స్థిరమయ్యింది. ఉదయం కాఫీ కప్పు అందించటంతో ప్రారంభమవుతుంది నా దినచర్య. స్నానానికి వేడినీళ్ళు పెట్టటం, స్నానం చేసి రాగానే అమ్మ చేసిన టిఫిన్ పెట్టడం.. బట్టలు ఉతికేటప్పటికి భోజనం టైం అయ్యేది. టేబుల్ మీద అన్నీ అరేంజ్ చేస్తే అప్పుడు తన గదిలో నుంచి బయటకు వచ్చి భోజనం చేసి వెంటనే గదిలోకి వెళ్ళి తలుపులు వేసుకునేది. మళ్ళీ ఆ తలుపులు సాయంత్రం 5-30 గంటల దాకా అలా మూసుకునే వుండేవి. అన్నయ్య వచ్చేది అప్పుడే కాబట్టి. మొహానికి అమృతాంజనం పట్టించి ఆ ఘాటుకు కళ్ళమ్మటే నీళ్ళు కారుతుంటే బీరువాలో నుంచి రెండు రెండు మూడు చీరలు తడిపేసి ఉతకలేక ఉతుకుతున్నట్లు అవస్థపడేది. ఆ 'టైం'లో పరాయివాళ్ళు ఎవరయినా వచ్చి మా వదినను చూస్తే తెల్లగా ఉండే ఆమె మొహం అమృతాంజనం ఘాటుకు ఎర్రగా కందిపోయి నిజంగా ఎంతో పెద్దరోగం వచ్చినా ఇంటిపనులు తను ఒక్కతే చేస్తోందని తెగ సానుభూతి చూపిస్తారు. అలాంటిది మా అన్నయ్య వచ్చి తనను చూస్తే..ఇక చెప్పేదేముంది. ఇంటిని రణరంగంలా చేసేవాడు. తన పెళ్ళానికి ఇంటి పనులలో సాయం చేయకుండా నేను 'ఆడపడుచు' హోదా వెలగబెడుతున్నానని. పెళ్ళికాక ముందు ఎంతో లాజిక్‌గా ఆలోచించి మాట్లాడే అన్నయ్య ఇప్పుడు అలా ఆలోచించడం మరచిపోయాడు. లేకపోతే అలా ఉతికిన చీరలు ఈ వారంలో తన భార్య ఎప్పుడయినా ఒక్కసారన్నా కట్టుకుందా? లేదా? అని ఆలోచించేవాడు. అన్నా చెల్లెళ్ళమధ్య యుద్ధం ఆగిపోగానే అంతవరకూ ఉన్న తలనొప్పి, జ్వరం మా వదినను వదిలేసి పారిపోయేవి. నిమిషాల మీద తయారయ్యి మా అన్నయ్యతో షికారుకెళ్ళేది.

★ ★ ★

ఏ రోజూ తన గది దాటి ఇవతలకు రాని వదిన తన వాళ్ళు వచ్చినా మా చుట్టాలెవరయినా వచ్చినా ప్రతి పనీ తానే చేస్తూ, ఒక గిన్నెలో అన్నం కలిపి ముద్దలు చేసి బలవంతంగా నా నోట్లో కుక్కి చూసేవాళ్ళు. 'ఆహా! ఇటువంటి కోడలు ఎవరికయినా దొరుకుతుందా ఈ రోజులలో?' అని ఆశ్చర్యపోయేట్లు చేస్తుంది.

ఇలాంటి సంఘటనలు మా యింట్లో కోకొల్లలు. ఫలితంగా మా అన్నాచెల్లెళ్ళ బంధం తెగిపోయింది. భార్యాభర్తల బంధాన్ని 'విడాకులు' పేరుతో ఒక కాగితం మీద పెట్టే సంతకంతో తెంపుకోవచ్చు. కానీ రక్తసంబంధాన్ని తెంపటానికి ఏ చట్టాలూ ఉండవు.



ఎంతో చాకచక్యంతో కలసిమెలసి ఉన్న మా అన్నా చెల్లెళ్ళను విడగొట్టింది మా వదిన. 'ఒక చిరునవ్వుతో దేనినయినా సాధించవచ్చు' అనే మాటకు అర్థం ఇలా కూడా వర్తిస్తుందేమో! ఒక్కొక్కసారి అనుకుంటాను 'ఎవరికో పుట్టి, ఎక్కడో పెరిగి, మా యింటికి వచ్చి మమ్మల్ని విడదీసింది కదా ఈవిడగారు' అని. మళ్ళీ వెంటనే అనుకుంటాను, 'ఒకే ఇంట్లోపుట్టి పెరిగి- ఎంతో ప్రేమగా మసలుకున్న మేము నేడు బద్ధశత్రువులుగా మారాము అంటే ఇన్నాళ్ళూ మా మధ్య ఉన్న 'ప్రేమ' నిజం కాదేమో' నని. ఈ ఇంట్లోనే స్థిరంగా ఉండే అన్నయ్య, ఎవరింటికో వెళ్ళబోయే నేను రాబోయే రైలుకోసం ప్లాట్ ఫాం మీద ఎదురుచూసే ఇద్దరు పాసింజర్ల మధ్య జరిగే టైం పాస్ సంభాషణాల్లా ఇంతకాలం మేమూ గడిపామేమో! అత్త, ఆడపడుచు అనగానే ఇంట్లోకి అడుగు పెట్టిన నవ వధువును హింసించే శాడిస్టుల్లా వర్ణించారేగాని, ఆ నవ వధువు జీవిత నాటక రంగంపై ఒలికించే నవరసాల అభినయాన్ని అర్థం చేసుకోలేని ఆడబడుచుల గురించి ఎవరయినా కథగా వ్రాశారా? ఏమో! నా మదిలో జరిగే సంఘర్షణను ఎవరికయినా చెప్పుకోవాలని ఉంది. ఎందుకంటే నాకు 'పెళ్ళి' నిశ్చయమైంది. ఇంకో నెలరోజులలో వేరొక ఇంటికి 'నవవధువు'గా వెళ్తున్నాను.

నాకు ఇద్దరు ఆడపడుచులున్నారు. ఒకరికి పెళ్ళయ్యింది. వేరొకరు పెళ్ళికి సిద్ధంగా వున్నారు. ఇక్కడ ఆడపడుచు హోదాలో ఉండి కూడా ఛీత్కారాల మధ్య బ్రతికాను. అక్కడ 'ఆడపడుచు' హోదాలో ఉన్నవారిచేత ఛీత్కరింపబడుతూ బ్రతుకుతానేమోననే భయం మనస్సున అలజడిని రేపుతోంది.

నేను పుట్టింటి నుంచి బయటకు అడుగుపెట్టగానే మా యింటి తలుపులే కాదు వారి మది తలుపులు కూడా మూసుకుపోతాయి. నా గురించిన తలపులు తుడిచిపెట్టుకు పోతాయి. అందుకే నేను వెళ్ళే మెట్టినిల్లే నాకు పుట్టిల్లు కావాలని, నా ఆడపడుచులే నాకు తోబుట్టువులుగా ఉండాలని ముక్కోటి దేవుళ్ళ ఆశీస్సుల కోసం ఎదురుచూస్తున్నాను.